సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ¡ 31 ¡ జనవరి ¡ 2023



ఆదిబట్ల చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఆదిబట్ల మున్సిపల్ చైరపర్సన్‌పై అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి నోటీసు ఇచ్చారు. 8లో▸

బీసీల బడ్జెట్ రూ.20 వేల కోట్లకు పెంచాలి

కాచిగూడ: రాష్ట్రంలో బీసీల బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ.2వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ కేటగిరీ- 2 అడ్మిషన్ల కోసం జరిగే ఇంటర్వ్యూలకు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని సోమవారం పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఓయూ నిర్వహించిన 2022 పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని ఉస్మానియా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఆయా విభాగాల డీన్ ఫ్యాకల్టీ కార్యాలయాల్లో ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇటు స్పీడ్.. అటు స్లో



ఎల్‌బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు శరవేగంగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



హైదరాబాద్- బీజాపూర్ రహదారి మొయినాబాద్ వద్ద మొదలుపెట్టని పనులు

ఎక్స్‌ప్రెస్‌వే తరహా రోడ్ల విస్తరణ పనులు

- రూ.545 కోట్లతో ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు..
- రూ.928.41 కోట్లతో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ దాకా..
- త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలంటున్న ప్రయాణికులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో చేపట్టిన రెండు జాతీయ రహదారుల విస్తరణ పనుల్లో ఒకటి ఆగుతూ..సాగుతుండగా.. మరొకటి జెట్ స్పీడ్‌తో ముందుకు వెళ్తోంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కేంద్రం రూ.1,473.41 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలోని ఇటు హైదరాబాద్ నుంచి బీజాపూర్ వెళ్లే ఎన్‌హెచ్-163 (అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్లు), అటు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఎన్‌హెచ్- 65 (ఎల్బీనగర్ నుంచి దండు మల్కాపురం వరకు ఆరులేన్లు) రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు చేపట్టిన పనులు వేగంగా పూర్తవుతుండగా.. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు చేపట్టిన పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. అధికారుల అలసత్వానికి తోడు.. భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో చోటు చేసుకుంటున్న జాప్యం, రోడ్డుకు అటు ఇటుగా విస్తరించిన మర్రిచెట్ల తొలగింపుపై నెలకొన్న వివాదమే ఇందుకు కారణంగా తెలిసింది.

వడివడిగా ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు

హైదరాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా మీదుగా విజయవాడవైపు వెళ్లే జాతీయ రహదారి ఎన్‌హెచ్-65 (ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు 25 కిలో మీటర్ల వరకు)ని ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లుగా విస్తరించాలని నిర్ణయించి, ఈ మేరకు ఇటీవల పనులు చేపట్టింది. ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ వరకు ఎక్కడా సిగ్నల్ లేకుండా ప్రయాణించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు రూ.545 కోట్లు ఖర్చవుతున్నట్లు అంచనా వేసింది. స్థానికులకు ఇబ్బంది కలుగకుండా వనస్థలిపురం, సుష్మా, పనామా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ జంక్షన్, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, ఇనాంగూడ, బాటసింగారం మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అండర్ పాసుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణకు అనుగుణంగా ప్రస్తుతం కొత్తగూడెం వద్ద ఉన్న వాగుపై రూ.25 కోట్లతో ఎనిమిది లేన్లతో బ్రిడ్జిని ఇప్పటికే పూర్తి చేసింది. ఈ రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాదిలోగా దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

ఆగుతూ..సాగుతూ..

హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకు (ఎన్‌హెచ్-163) జాతీయ రహదారి విస్తరించింది. ఈ రోడ్డుపై అటు ఇటుగా రోజుకు సగటున 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ రోడ్డు రెండు లేన్లే ఉంది. ఇరుకైన ఈ దారిపై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ ప్రజలు రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక మంది మృత్యువాతపడ్డారు. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు సుమారు 46 కిలోమీటర్ల దూరంలో నాలుగు లేన్ల విస్తరణ పనులు చేపట్టింది. నిజానికి ఈ రోడ్డును ఆరు లేన్లుగా విస్తరించాలని నిర్ణయించి, భూ సేకరణలో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా దీన్ని ప్రస్తుతం నాలుగు లేన్లకు కుదించింది. ఇప్పటికే రోడ్డుకు అటు ఇటుగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రహరీల తొలగింపు పనులు మొదలు పెట్టింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మొయినాబాద్ సమీపంలోని జేబీఐటీ నుంచి కనకమామిడి వరకు (సుమారు నాలుగు కిలోమీటర్లు) బైపాస్‌రోడ్డుతో పాటు చేవెళ్ల కేసారం నుంచి దామరగిద్ద వరకు (సుమారు ఆరు కిలోమీటర్లు) బైపాస్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది. రైతులు, ఇతర ప్రజలకు ఇబ్బంది కలగకుండా సర్వీసు రోడ్లతో పాటు ఈ మార్గంలో మొత్తం 18 చోట్ల అండర్ పాస్‌లు నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం పనులు ఆగుతూ.. సాగుతున్నాయి.



మాట్లాడుతున్న బొక్కా నర్సింహారెడ్డి

హామీలు ఏమయ్యాయి?

- అభివృద్ధిలో నిర్లక్ష్యం తగదు
- అలా చేస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను తిరగనివ్వం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

షాద్‌నగర్: అభివృద్ధిలో నిర్లక్ష్యం వహిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను తిరగనివ్వమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూపరంగా అత్యధిక ఆదాయం లభిస్తున్న జిల్లాలో ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. పాలనా పరంగా అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నప్పటికీ లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం వాగ్దానాన్ని విస్మరించిందని మండిపడ్డారు. ధనిక జిల్లాలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి సొంత ఇంటిని కట్టిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి జిల్లాకు సంబంధించి బడ్జెట్‌లో చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సమావేశంలో శ్రీవర్ధన్ రెడ్డి, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, దేపల్లి అశోక్‌గౌడ్, చెంది మహేందర్‌రెడ్డి, మురళి, చెట్ల వెంకటేశ్, వంశీ, మనోహర్‌రెడ్డి, అశోక్, కుర్మయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాణాలో ఆత్మహత్యాయత్నం



ఇబ్రహీంపట్నం: రాణాలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన బి. జంగయ్య (46), అతని తమ్ముడు కృష్ణ మధ్య ఆర్థికపరమైన విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ్ముడి భార్య లక్ష్మమ్మతో జంగయ్య గొడవపడి దురుసుగా ప్రవర్తించాడు. దీంతో లక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. విచారణ నిమిత్తం స్టేషన్‌కు జంగయ్యను తీసుకొచ్చారు. మనస్తాపానికి గురైన జంగయ్య పురుగుల మందు తాగి స్టేషన్ బాత్రూంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన పోలీసులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం సృష్టించింది.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 60 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎంతో కృషి చేస్తోందని సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊరెళ్ల, దేవుని ఎర్రవల్లి, మల్కాపురం, గుండాల, చందనవెల్లి గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్టీయూ పోరాటం మేరకు ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఉపాధ్యాయులకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేలా మూలవేతనం నుంచి 1 శాతం వేతనం అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ యాదవ్, మండల అధ్యక్షుడు సత్యగౌడ్, ప్రధాన కార్యదర్శి వినోద్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటేశం, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

8 వారాల్లో అంతిరెడ్డిగూడకు ఎన్నికలు నిర్వహించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నందిగామ మండలం అంతిరెడ్డిగూడ పంచాయతీకి ఎనిమిది వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుల అనంతరం అంతిరెడ్డిగూడ 2020లో కొత్త పంచాయతీగా ఏర్పడినా ఎన్నికలు నిర్వహించడం లేదంటూ అదే గ్రామానికి చెందిన అంజియాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సర్పంచ్ లేని కారణంగా మూడేళ్ల నుంచి ప్రత్యేక అధికారి పాలనే సాగుతోందని, ఎన్నికలు నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.

విద్యార్థి మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి



రోడ్లపైకి వచ్చిన వీఎంహోం విద్యార్థులు

- వీఎంహోం విద్యార్థుల ఆందోళన
- కనీసం నివాళి కూడా అర్పించలేదని ఆవేదన

హుడాకాంప్లెక్స్: సహచర విద్యార్థి మృతి చెంది మూడు రోజులైనా కనీసం నివాళి కూడా అర్పించడం లేదని విక్టోరియా మెమోరియల్ హోం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హరినాయక్ చనిపోవడానికి కారణాలు తెలపాలని సోమవారం హోం విద్యార్థులు ఆందోళనకు దిగారు. శనివారం అనుమానాస్పదంగా చనిపోయిన హరినాయక్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, తమకు భద్రత కల్పించాలని కోరారు. ఉదయం గంటల సమయంలో హోం స్కూల్ నుంచి ఒక్కసారిగా రోడ్డు రోడ్డుపై పరుగెత్తుకుంటూ కొత్తపేట చౌరస్తాకు చేరుకున్నారు. కమిషనర్ యోగితారాణి వివరణ ఇవ్వాలని, హరినాయక్‌కు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. హోం హాస్టల్‌లో ఏమో జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్ చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనతో కొత్తపేట చౌరస్తాలో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను హోంకు తరలించారు. అనంతరం ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారితో కలిసి హరినాయక్ మృతికి నివాళి అర్పించారు. హరినాయక్ మృతిపై విచారణ జరుగుతోందని, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించి తరగతులకు హాజరయ్యారు.

13 ఏళ్లు.. 3 సార్లు

- భూ పరిహారం కోసం కుటుంబం ఆత్మహత్యాయత్నం
- ఇతరులు కాజేశారని ఆరోపణ
- తాజాగా ప్రగతిభవన్ వద్ద కలకలం

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: తమ భూమి పరిహారం ఇతరులు కాజేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వ్యక్తి 13 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాడు. విషయం సీఎం దృష్టికి వెళ్తే సమస్య పరిష్కారం అవుతుందని భావించి గతంలో రెండుసార్లు, తాజాగా సోమవారం ప్రగతిభవన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. మాచమోని ఐలేష్ బడంగ్‌పేటలో నివాసం ఉంటున్నాడు. ఇతని తండ్రి మాచమోని వెంకయ్యకు ఇబ్రహీంపట్నం వినోబానగర్‌లోని 58 సర్వే నంబర్‌లో భూదాన్‌బోర్డు కేటాయించిన ఐదెకరాల భూమి ఉంది. ఇదే సర్వే నంబర్‌లోని 600 ఎకరాల భూమిని 2011లో ప్రభుత్వం ఎన్‌ఎస్‌జీకి కేటాయించింది. దీనికి సంబంధించి ప్రిలిమరీ నోటీసులో ఐలేష్ తండ్రి వెంకయ్య పేరు ఉంది. ఫైనల్ డిక్లరేషన్‌లో మాత్రం వారి పేరు రాలేదు. ముగ్గురు ఇతర వ్యక్తులపై ఆ భూమి ఉన్నట్లు డిక్లేరేషన్‌లో ఉంది. దీంతో వారికే భూ నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేసింది. బడంగ్‌పేటలో ఉంటున్న వెంకయ్య కుమారుడు ఐలేష్‌కు ఈ విషయం ఆలస్యంగా తెలిసింది. అప్పటి భూదాన్‌బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డితోపాటు పట్వారి రాంరెడ్డిలు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన తండ్రి పేరుపై ఉన్న భూదాన్ భూమి రికార్డులు తారుమారు చేశారని ఐలేష్ ఆరోపిస్తున్నారు. అప్పటి మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. అప్పటి నుంచి తనకు న్యాయం చేయాలంటూ ఆయన పోరాటం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇబ్రహీంపట్నం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు కుటుంబ సభ్యులు పాదయాత్ర చేసినా అధికారుల నుంచి స్పందన రాలేదు. నగరంలోని భూదాన్‌బోర్డు కార్యాలయంలో ఒకసారి, 2021లో, తాజాగా సోమవారం ప్రగతిభవన్ ఎదుట కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భూ పరిహారం కోసం తిరిగి తన ఇల్లును అమ్ముకున్నానని చెప్పాడు. ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని, ఇందుకు ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్నాడు. రెవెన్యూ అధికారులు తన సమస్యను పరిష్కరించడంలేదని కనీసం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఈ విషయం వెళితే పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ఐలేష్ ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఐలేష్ కుటుంబసభ్యులు ఈ భూమిని ఇతరులకు విక్రయించడంతోనే భూదాన్‌బోర్డులో పేరు మార్పు జరిగినట్లు బోర్డుకు సంబంధించిన సిబ్బంది అప్పట్లో చెప్పారు. ఇది ఎంతవరకు వాస్తవమో కాదో అధికారులే తేల్చాల్సి వుంది.



ఆత్మహత్యకు యత్నించిన ఐలేష్ కుటుంబం

పరిహారం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధం..

పంజగుట్ట: తన భూమిపై వచ్చిన నష్టపరిహారాన్ని అధికారులు తీసుకున్నారని తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వ్యక్తి కుటుంబంతో సహా ప్రగతిభవన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. నాదర్‌గూల్‌కు చెందిన ఐలేష్ సోమవారం మధ్యాహ్నం తన భార్య అనూరాధ, కుమార్తె అక్షిత, కుమారులు మణితేజ, వేణుతేజతో కలిసి ఆటోలో ప్రగతిభవన్ వద్దకు వచ్చాడు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కిరోసిన్ వంటిపై పోసుకుని భార్య, పిల్లలపై కూడా పోశాడు. దీనిని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకుని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఐలేష్ మాట్లాడుతూ తమకు ఇబ్రహీంపట్నం, సర్వేనంబర్ 58లో ఐదు ఎకరాల భూమి ఉండేదని దానిని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ) కోసం కేంద్ర ప్రభుత్వం 2010లో సేకరించిందన్నాడు. నష్ట పరిహారం కింద ఎకరానికి రూ. 6 లక్షలు చెల్లించినట్లు తెలిపాడు. తన పట్టా 306 నెంబర్ కాగా 307 నంబర్‌తో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఎంఆర్‌ఓ, వీఆర్‌వో, ఆర్‌డీవో, భూదాన్ సెక్రటరీ తనకు రావాల్సిన పరిహారాన్ని స్వాహా చేశారని ఆరోపించాడు. అప్పటి నుంచి పోరాటం చేస్తూనే ఉన్నానని తనవద్ద అన్ని ఆధారాలు ఉన్నట్లు తెలిపాడు. తాను భూమిని కోల్పోయానని, నష్ట పరిహారం కూడా రాలేదని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. గతంలోనూ అతను రెండుసార్లు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించడం గమనార్హం. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

70వేల మందికి కంటి పరీక్షలు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

- కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 70,795 మందికి స్క్రీనింగ్ చేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, సీఎస్ శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అమయ్‌కుమార్ మాట్లాడారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చి, రోగుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. పోడు భూములకు సంబంధించి ఇప్పటికే రైతులతో గ్రామాలవారీగా చర్చలు జరిపి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. మన ఊరు మన బడి పథకం కింద జిల్లాలో ఇప్పటికే 38 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి పాల్గొన్నారు.



భలేభలే వ్యాన్

టీ హబ్ ప్రాంగణంలో సోమవారం పెట్‌ఫోక్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రూమింగ్ వ్యాన్‌ను ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ప్రారంభించారు. వినూత్న ఆలోచనలతో పక్షులు, జంతువుల యజమానులందరికీ 'వన్‌స్టాప్ సొల్యూషన్' తాజా యాప్‌తో పాటు ప్రత్యేకంగా గ్రూమింగ్ వ్యాన్‌ను ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు. పెట్‌ఫోక్ స్టార్టప్ వ్యవస్థాపకులు లక్ష్మీకాంత్, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– రాయదుర్గం



మహిళా లీడర్‌షిప్ నేషనల్ అవార్డుకు..

పులిమామిడి మాజీ సర్పంచ్ దేవిగౌడ్


ధృవీకరణ పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడికి చెందిన మాజీ సర్పంచ్ అనేగాని దేవిపాండుగౌడ్ మహిళా లీడర్‌షిప్ నేషనల్ అవార్డు–2023కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ విష్ణువర్ధన్ చేతుల మీదుగా సోమవారం ఆమె ఎంపికకు సంబంధించిన పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 12న తిరుపతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బహుజన సాహిత్య అకాడమీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ అవార్డుకు ఎస్‌ఐ

మహేశ్వరం: సంత్ సేవాలాల్ మహారాజ్ జాతీయ సాహిత్య అవార్డుకు మహేశ్వరం ఎస్‌ఐ జర్పుల వెంకటయ్యనాయక్ ఎంపికయ్యారు. సోమవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ప్రతినిధులు ఎస్‌ఐ వెంకటయ్యకు ధృవపత్రాన్ని అందజేసి అభినందించారు. మార్చి 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ సౌత్ ఇండియా 6వ జాతీయ సదస్సులో అవార్డు అందజేస్తామని బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని ఎస్‌ఐ అన్నారు.

బాలుడిని ఢీకొట్టిన బొలేరో

డ్రైవర్ పరార్

కడ్తాల్: మండల పరిధిలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కర్కల్ పహాడ్ చౌరస్తా వద్ద మధ్యాహ్నం సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడు అరుణ్‌తేజ్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు అతి వేగంగా ప్రయాణిస్తున్న బొలేరో వాహనం బాలుడిని ఢీకొట్టింది. దీంతో బాలుడి బాలుడికి తలకు, కాళ్లకు తీవ్రగాయాలయై పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు, వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలేరో డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ పరారయ్యాడు. అరుణ్‌తేజ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. చేవెళ్ల ఎస్‌ఐ ప్రదీప్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన జవాజీ లక్ష్మయ్య(48) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిగానే ఈ నెల 29న తన స్నేహితుడు రాజుతో కలిసి శంకర్‌పల్లి మండలంలో పనిచేసేందుకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా శంకర్‌పల్లి మండలం టంగుటూరు స్టేజి వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కొందుర్గు: జిల్లేడ్ చౌదరి గూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి ఒంటిపై బూడిద రంగు గీతల చొక్కా, నీలం రంగు బనియన్, నీలం రంగు జీన్స్ పాయింట్ ఉన్నాయని చెప్పారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి మర్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

మియాపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొని పోలీస్ కానిస్టేబుల్ మృతిచెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, నూరెళ్లపూర్ గ్రామానికి చెందిన ఎస్‌కే ముఫీద్(30)సైబరాబాద్ పరిధిలో అసిస్టెంట్ ఎనాలసిస్ ఆఫీసర్(ఇంటెలిజెన్స్) విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ప్రతిరోజు అతను వికారాబాద్ నుంచి లింగంపల్లి వరకు రైలులో నగరానికి వచ్చి అక్కడి నుంచి బైక్‌పై గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్తుండేవాడు. సోమవారం ఉదయం లింగంపల్లికి వచ్చిన అతను తన స్నేహితుడు సమీర్‌తో కలిసి బైక్‌పై గచ్చిబౌలి వైపు వెళ్తుండగా బర్కత్‌పుర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముఫీద్ బస్సు వెనక చక్రాల కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న చందానగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సమీర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతుడి సోదరుడు సద్దాం పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం


పి.మణిదీప (ఫైల్)

పహాడీషరీఫ్: నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్ తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన పులిజాల తిరుపతయ్య కుమార్తె మణిదీప(22) బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 28న ఉదయం 11.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన మణిదీప తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 94906 17241 నెంబర్‌లోగానీ సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

భార్యతో గొడవపడి..


రవితేజ(ఫైల్)

కందుకూరు: భార్యతో గొడవపడిన వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కందుకూరు సీఐ కృష్ణంరాజు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన తిమ్మగళ్ల రవితేజ(27) ఈ నెల 24న భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కొండల్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9490617237, 7901103284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించడంతో..


హిమాన్స్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠశాలకు వెళ్లడం లేదని తల్లిదండ్రు లు మందలించడంతో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది.ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్ కమ్మగూడలో నివాసం ఉండే ప్రభాకర్ కుమారుడు హిమాన్స్ (13) విజ్ఞాన్ పాఠశాలలో 9వ తరగతి చదు వుతున్నాడు. పది రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ నెల 29న రాత్రి 11గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ప్రభాకర్ ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిబట్ల చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- నోటీసులు సమర్పించిన 13 మంది కౌన్సిలర్లు
- ఒక్కసారిగా వేడెక్కిన రాజకీయం


అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చి బయటికి వచ్చిన మున్సిపల్ పాలకవర్గం సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిన్న ఇబ్రహీంపట్నం.. నేడు ఆదిబట్ల మున్సిపాలిటీలపై అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి నోటీసు జారీ చేశారు. మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌పార్టీకి చెందిన కౌన్సిలర్లు 13 మంది చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్ తీరుకు వ్యతిరేకంగా సంతకాలు చేసి అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు అందజేశారు. రెండు రోజుల క్రితమే నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. ఆదిబట్ల మున్సిపాలిటీలో మూడేళ్లుగా చైర్‌పర్సన్‌కు పాలకవర్గం సభ్యులకు సమన్వయం కుదరడం లేదు. కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆర్తికగౌడ్ చైర్మన్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌లోకి వచ్చి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం ఆ పార్టీలో ఇమడలేక, పాలకవర్గం సభ్యులు సహకరించక ఏడాది క్రితం కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ ఈ పార్టీ కౌన్సిలర్లు కూడా చైర్‌పర్సన్‌కు సహకరించ లేదు. ప్రస్తుతం ఆదిబట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ 7 మంది కౌన్సిలర్లు, టీఆర్‌ఎస్‌కు 7 మంది కౌన్సిలర్లు, బీజేపీ ఒకరు చొప్పున మొత్తం 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. మరో నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన సభ్యుల్లో టీఆర్‌ఎస్‌కు చెందిన కళమ్మ, మానిక, మహేందర్, శ్రీనివాస్, నగేష్, కంతి సంధ్య, కొప్పు కృష్ణరాజు, కాంగ్రెస్ పార్టీకి చెందిన మర్రి నిరంజన్‌రెడ్డి, నల్లబోలు లావణ్య, మర్రి అర్చన, కుంట్ల మానిక, కమాండ్ల యాదగిరి, నీళ్ల హరిదాసుగౌడ్ సంతకాలు చేశారు. బీజేపీకి చెందిన పొట్టి రాములు అందుబాటులో లేకపోవడంతో సంతకం చేయలేదని తెలిసింది. మొత్తానికి ఆదిబట్లలో చైర్‌పర్సన్ అవిశ్వాస తీర్మానం కోసం నోటీసు జారీ చేయడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

పట్నం మున్సిపాలిటీలో..


సీడీఎంఏ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో ఇద్దరు కౌన్సిలర్లు మినహా మిగతా అందరూ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. 24 మంది కౌన్సిలర్లకుగాను కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురిలో ఈర్లపల్లి సునీత, ఆకుల మమత మినహా బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో పాటు 21 మంది అవిశ్వాసం పెట్టాలని ఉన్నతాధికారులకు నోటీసు సమర్పించారు. సోమవారం సీడీఎంఏ అధికారి అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చీఫ్ సెక్రటరీలకు అందజేశారు. అధికార పార్టీ కౌన్సిలర్లు అదే పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దించడానికి ఎత్తుగడలు వేస్తుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మహాత్ముడి బోధనలు అనుసరణీయం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


చందన చెరువు కట్టపై మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: మహాత్ముడి బోధనలు అనుసరణీయమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో జిల్లెలగూడ చందన చెరువు కట్టపైనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

రాహుల్ గాంధీకి అండగా నిలుద్దాం

భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా జిల్లెలగూడ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ మాట్లాడుతూ.. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన జోడో యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ దేశాన్ని ఏకం చేశారని అన్నారు. జోడోయాత్ర విజయవంతమైందని, అదే విధంగా ఫిబ్రవరి 6న ప్రారంభమయ్యే హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ప్రజలంతా ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏనుగు జంగారెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, పరశురాం, మల్లేశ్, మాడుగుల యాదయ్య, శేఖర్‌రెడ్డి, ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడుదాం: జంగయ్య

చేవెళ్ల: దేశ సమగ్రతను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా షాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మతతత్వం పెరిగిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు సుధాకర్‌గౌడ్, పార్టీ చేవెళ్ల, షాబాద్ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, జంగయ్య, నాయకులు రఘురాం, రుక్కయ్య, మధు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పినా..

భర్త పట్టించుకోలేదని మహిళ బలవన్మరణం

బంజారాహిల్స్: తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని భర్తకు సెల్ఫీ తీసుకుని ఫొటో పెట్టిన స్పందించలేదని మనస్తాపానికి గురైన ఓ యువతి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన రాజన్ పర్వార్, పూజ(19) దంపతులు ఏడాదిన్నర క్రితం నేపాల్ నుంచి నగరానికి వలసవచ్చారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 లోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీలోని ఓ ఇంట్లో పని చేస్తున్నారు. రాజన్ కాపలాదారుగా పని చేస్తుండగా, పూజ వంట పని చేసేది. టిక్‌టాక్‌లు చేస్తున్న పూజను రాజన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కాగా గత కొంత కాలంగా భర్త తనను పట్టించుకోవడం లేదని పూజ ఆరోపిస్తూ ఉండేది. అతను మరొకరితో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని సన్నిహితుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో తనకు బతకాలని లేదంటూ ఇంటి యజమాని వద్ద కూడా వాపోయింది. ఆదివారం సాయంత్రం రాజన్ గేటు వద్ద విధుల్లో ఉండగా బాత్‌రూమ్‌లోకి వెళ్లిన పూజ మెడకు చున్నీ చుట్టుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా సెల్ఫీ తీసి భర్తకు పంపింది. అయితే రాజన్ ఆ ఫొటో చూసుకోలేదు. రెండు గంటలు గడిచినా భర్త స్పందించకపోవడంతో మనస్తాపానికి లోనైన ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భార్య ఎంతకూ బయటికి రాకపోయేసరికి అనుమానం వచ్చిన రాజన్ కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఇంటి యజమాని సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. జూబ్లీహిల్స్ పోలీసులు రాజన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి హైడ్రామా..

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పీర్జాదిగూడ, సాయి ఐశ్వర్య కాలనీలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కొందరు వ్యక్తులు దాడులకు పాల్పడినందుకు నిరసనగా సోమవారం జర్నలిస్టులు మేడిపల్లి పీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మేడిపల్లి సీఐ గోవర్ధనగిరికి వినతిపత్రం అందజేశారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంకూరి మురళి, ప్రధాన కార్యదర్శి కల్యూరి ఎల్లయ్య, పలు పార్టీల నాయకులు తుంగతుర్తి రవి, నెమిలి కొండ అనిల్ రెడ్డి, పవన్ రెడ్డి, పంగ ప్రణయ్ కుమార్, అన్వర్, ప్రెస్ క్లబ్ సభ్యులు, ప్రింట్,ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కండక్టర్ భిక్షపతికి 'స్ఫూర్తి సేవారత్న'


భిక్షపతికి పురస్కారం అందజేస్తున్న మోహన్‌రావు

ఇబ్రహీంపట్నం: ఎల్మినేడు గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బజారు భిక్షపతి ఎన్నో ఏళ్లుగా పేదలకు, అనాథలకు, వృద్ధులకు సేవలు చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ స్ఫూర్తి సేవారత్న జాతీయ పురస్కారాన్ని అందజేసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు భిక్షపతిని సన్మానించి, షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి


ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమ్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోలన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ ఆందోళనలో సంఘం నాయకులు చరణ్, విప్లవ్‌కుమార్, తరంగ్, స్టాలిన్, సందీప్, మనోహర్, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

కొరియర్ వచ్చిందని చెప్పి..

- కత్తితో బెదిరించి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ
- నిందితుడి అరెస్ట్

లంగర్‌హౌస్: కొరియర్ వచ్చిందంటూ పలు మార్లు ఓ వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఆమెను కత్తితో బెదిరించి బంగారు గొలుసు లాక్కెళ్లిన యువకుడిని లంగర్ హౌస్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీసీపీ ముజీబ్ ఉర్ రెహమాన్, డీఎస్సై రాఘవేంద్ర స్వామిలతో కలిసి ఆసిఫ్‌నగర్ ఏసీపీ శివమారుతి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన సయ్యద్ హమీద్ మెహిదీపట్నంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన అతను తన తమ్ముడి ఫీజు కట్టడానికి చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. తాను డెలివరీ చేసే ప్రాంతాలను పరిశీలిస్తూ అదును కోసం ఎదురు చూస్తున్నాడు. నెల రోజుల క్రితం మారుతీ నగర్‌లోని ఓ ఇంట్లో డెలివరీ ఇచ్చాడు. సదరు వృద్ధురాలు ఒక్కరే ఉండటంతో పలుమార్లు అక్కడ చోరీకి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ నెల 23న మరోసారి ఆమె ఇంటికి వెళ్లిన హమీద్ కొరియర్ వచ్చిందని చెప్పాడు. అయితే ఆమె డోర్ తీయకుండా తన కుమారుడు వచ్చాకే అతనికే ఇవ్వాలని చెప్పింది. అదే రోజు పలుమార్లు ఆమె ఇంటికి వెళ్లి కొరియర్ తీసుకోవాలని ఒత్తిడి చేసినా ఆమె నిరాకరించింది. సాయంత్రం అతను వెళ్లిపోయాడని భావించిన వృద్ధురాలు తలుపులు తెరిచి చూడగా పక్కనే దాగి ఉన్న సయ్యద్ ఇంట్లోకి దూరి ఆమెను కత్తితో బెదిరించి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు 29న అతడిని అదుపులోకి తీసుకుని, సోమవారం రిమాండ్‌కు తరలించారు.